క్లుప్తంగా

శ్రీ మఠంలో నేడు ద్వాదశి వేడుకలు

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో శుక్రవారం ద్వాదశి వేడుకలు నిర్వహించనున్నారు. గురువారం ఏకదాశి సందర్భంగా భక్తులకు స్వామివారి నిజరూప బృందావన దర్శన భాగ్యం కల్పించారు. ఏకాదశి కావడంతో ప్రసాద విక్రయాలు, అన్నదాన సేవలు నిలిపివేశారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి మూలబృందావనానికి విశేష పూజలు చేపట్టిన అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆలయ వర్గాలు తెలిపాయి.

మార్కెట్ వేలాలు వాయిదా

ఆదోని టౌన్ : స్థానిక మున్సిపాలిటీ పరిధిలో ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్, పశువుల సంత, పశువులు, గొర్రెలు, మేకల కమీశాకు సంబంధించిన వేలాలను ఈనెల 23వ తేదీకి వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాయిదా వేశామని చెప్పారు. అయితే మార్కెట్ వేలం నిర్వహణ అనుమతి కోసం జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశామన్నారు.అనుమతి రాగానే వేలం వేస్తామని పేర్కొన్నారు. అయితే మార్కెట్ వేలం నిర్వహిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న కాంట్రాక్టర్‌లు కొందరు కార్యాలయం వద్దకు వచ్చి డిపాజిట్‌లు చెల్లించేందుకు సిద్ధపడగా, వాయిదా వేసిన విషయాన్ని వారికి తెలియజేశారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



తరగతి గదులను పరిశీలిస్తున్న అధికారులు

కౌతాళం: వచ్చే నెల 13న జరగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రాల్లో ఏర్పాట్లను తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదులు ఎన్నికల నిర్వహణకు అనువుగా ఉన్నాయని చెప్పారు. ఇక్కడ ఉపాధ్యాయులు, పట్టభద్రులకు వేర్వేరుగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

10 నుంచి 'పల్లెపల్లెకు బీజేపీ'

కౌతాళం: మార్చి 10 నుంచి 25వ తేదీ వరకు పల్లె పల్లెకు బీజేపీ కార్యక్రమం నిర్వహిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఆదోని డివిజన్ ఇన్‌చార్జ్ పురుషోత్తం రెడ్డి తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణతో కలిసి గురువారం కౌతాళంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 33 గ్రామాల్లో 15రోజులు పాటు పర్యటించి పల్లె నిద్ర చేసి ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అక్రమ మద్యం రవాణాపై నిఘా ఉంచండి

మంత్రాలయం రూరల్: కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై నిఘా ఉంచాలని మంత్రాలయం సీఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండలంలోని మాధవరం గ్రామ శివారులోనున్న సరిహద్దు చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కర్ణాటక నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే అనుమతించాలని సిబ్బందిని ఆదేశించారు. రికార్డులు సక్రమంగా లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.

బెల్లం ఊట ధ్వంసం

ఆదోని రూరల్ : నాటుసారా తయారు చేస్తే కేసులు నమోదు చేస్తామని సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. గురువారం పట్టణం సమీపంలోని రణమండల కొండపై నాటుసారా తయారీ స్థావరంపై దాడులు నిర్వహించారు. ఇందులో నాటుసారా తయారు చేస్తున్న బోయ రాజనన్ను అరెస్టు చేసి 200 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 2 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

కోనోకార్పస్ మొక్కలను నిషేధించాలి

ఆదోని అర్బన్ : విషపూరితమైన కోనోకార్పస్ మొక్కలను కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో పెంచడాన్ని నిషేధించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి నాగరాజుగౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం మెయిల్ ద్వారా విజయవాడ పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్‌కు, అనంతపురం రీజనల్ డైరెక్టర్‌కు పంపామని చెప్పారు. జరిగిందన్నారు. అలాగే స్థానిక పురపాలక కమిషనర్ రఘునాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఆ మొక్కలను పెంచడం, నాటడాన్ని నిషేధించిందని గుర్తు చేశారు.

విద్యుత్ ఏఓగా పరమేశ్వరరావు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ శాఖ కర్నూలు ఏఓ (ఎక్స్‌పెండేచర్)గా అంకా పరమేశ్వరరావు నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఓ విజితను నెల్లూరుకు బదిలీ చేయడంతో నంద్యాలలో ఏఏఓగా పనిచేస్తున్న అంకా పరమేశ్వరరావుకు పదోన్నతి కల్పించి ఇక్కడికి బదిలీ చేశారు. దీంతో ఏఓ విజిత ఇక్కడి నుంచి రిలీవ్ కావడంతో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడుల స్వీకరణ



మాలధారుల కు ఇరుముడి కడుతున్న శివస్వామి శైలేంద్రనాథ్



ఇరుముడి పూజల్లో పాల్గొన్న శివమాల ధారులు

ఆదోని అర్బన్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం భ్రమరాంబమల్లికార్జున స్వామి వారికి మొక్కులు చెల్లించేందుకు శివ మాలాధారులు ఇరుముడులతో శ్రీశైలం బయలుదేరారు. 41 రోజులు దీక్ష చేపట్టి మహాశివరాత్రి రోజు మల్లన్నకు మొక్కుబడి తీర్చేందుకు గురువారం జ్యోతిర్ముడి కట్టుకుని బయలుదేరి వెళ్లారు. స్థానిక గురుస్వామి శైలేంద్రనాథ్ ఆధ్వర్యంలో శంభులింగేశ్వర స్వామి ఆలయంలో దాదాపు 500 మంది ఇరుముడిని స్వీకరించారు. వీరిలో కొందరు వెంకటాపురం నుంచి పాదయాత్రగా, మరికొందరు బస్సులో నేరుగా శ్రీగిరికి బయలుదేరి వెళ్లారు.

అన్నదాన సేవకుడికి సన్మానం

స్థానిక శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో 40 రోజుల పాటు దాతల సాయంతో మాలధారులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమం నిర్వహించిన నిర్వాహకులు భాస్కర్‌ను శివస్వాములు ఘనంగా సన్మానించారు. రోజూ దాదాపు 300 మందికి ఆలయంలో అన్నదానం చేశారు.

శ్రీశైలానికి పాదయాత్ర

కోసిగి: మండల కేంద్రానికి చెందిన శివ మాలధారులు 50 మంది పాదయాత్రగా శ్రీశైలం బయలుదేరారు. గురువారం ఉరుకుంద క్రాస్ రోడ్డులో సిద్ధరూఢ ఆశ్రమంలో గురుస్వాములు ముధుస్వామి ఆధ్వర్యంలో దీక్షపరులు ఇరుముడి స్వీకరించి ప్రత్యేక పూజలు చేశారు. వీరు శివనామ స్మరణతో పాదయాత్ర ప్రారంభించగా.. మహిళలు కలశాలతో, కుటుంబ సభ్యులు, భక్తులు, బంధు మిత్రులు డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించి, సాగనంపారు.



ఇరుముడులతో బయలుదేరుతున్న మాలధారులు

సీఎంతో ఎమ్మెల్యే సాయి భేటీ



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ప్రదీప్‌రెడ్డి, మనోజ్‌కుమార్ రెడ్డి

ఆదోని టౌన్: ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, యువ నేత మనోజ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మంత్రాలయం నియోజకవర్గ నాయకుడు ప్రదీప్‌రెడ్డి గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సచివాలయంలో భేటీ అయ్యారు. ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన నిధుల విడుదల, అభివృద్ధి కార్యక్రమాలు, ఇతరత్రా సమస్యలను వారు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆదోనిలో అర్ధాంతరంగా ఆగిపోయిన బైపాస్ రోడ్డు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పట్టణంలో రోడ్ల విస్తరణ, మెడికల్ కాలేజీ నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా చూడాలని, ఆటోనగర్, పాత బైపాస్ రోడ్డుతో పాటు కొత్తగా మంజూరైన రింగురోడ్డు నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చొరవ చూపాలని కోరారు.

మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలి

ఆదోనిఅర్బన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని ఆదోనిలో ఏర్పాటు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, కార్యదర్శి లక్ష్మన్న, నాయకుడు ఆనంద్ కోరారు. ఈ మేరకు గురువారం వారు ఆదోనికి వచ్చిన ఆర్‌జేడీ ప్రతాప్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏపీటీజీ డైరీ, క్యాలెండర్‌ను సంఘం నాయకులు ఆర్‌జేడీ, జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డి, డిప్యూటీ ఈఓ సుకుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ఆర్‌జేడీ ప్రతాప రెడ్డి, డీఈఓ రంగారెడ్డి, డిప్యూటీ ఈఓ సుకుమార్

ఖాదర్‌లింగ స్వామికి ప్రత్యేక ఫాతెహాలు



స్వామి వారి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. భక్తుల రాకతో దర్గా పరిసరాలు కిటకిటాడాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. భక్తులకు ధర్మకర్త సయ్యద్ మున్నపాషా అన్నదానం ఏర్పాటు చేశారు.

పూజల పేరుతో మోసం



పోలీసుల అదుపులో కరణ్

కౌతాళం: పక్కీరు వేషంలో వచ్చి.. మీ ఇంట్లో దోషం ఉంది.. వివిధ రకాల పూజలు చేస్తే పరిహారమవుతుంది.. లేదంటే మీ కుటుంబానికే నష్టమంటూ ప్రజలను భయాందోళనలకు గురి చేసి డబ్బులు వసూలు చేస్తున్న ఓ యువకుడిని గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. మండల కేంద్రంలో ఓ యువకుడు పక్కీర్ వేషంలో సంచరిస్తూ ఇంటింటికీ తిరిగి దోషాలు నివారించే పూజలు చేస్తానని డబ్బులు దండుకుంటుండటంతో స్థానికులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో వారు అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా.. తనది కర్ణాటక రాష్ట్రమని, తన పేరు కరణ్ అని చెప్పారు. కరణ్‌పై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు.

విద్యార్థులు పోటీతత్వంతో చదువుకోవాలి

గోనెగండ్ల: విద్యార్థులు పోటీతత్వంతో చదువుతూ రాణిస్తే భవిష్యత్తు ఉత్తమంగా ఉంటుందని జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సురేష్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థుల నైపుణ్యాలు మరింత మెరుగు పరిచేందుకు పోటీలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు వీరన్న, మండల అధ్యక్షుడు ఖాజా, అధ్యాపకులు చంద్రశేఖర్, నూర్ అహమ్మద్, జయరాణి, భాగ్యలక్ష్మి, ఎస్ఎఫ్ఐ నాయకులు సలీం, నంది కుమార్, వీరంజిని తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీలో పతకాలు సాధించాలి

ఆదోని అర్బన్ : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పతకాలు సాధించి కర్నూలు జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఆయన సతీమణి కార్పల్‌అరోరా సూచించారు. గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలికల క్రీడా శిబిరాన్ని సందర్శించారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు చిత్తూరు జిల్లా నగరిలో జరిగే రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు పీఈటీలు క్రీడాకారిణులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్ దంపతులు క్రీడా శిబిరాన్ని సందర్శించారు. వారు మాట్లాడుతూ శిక్షణలో బాగా మెళకువలు నేర్చుకోవాలని, జీవితంలో ఎదగడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు కంబిరెడ్డి, నరసింహులు, నరసింమరాజు, ఆనంద్, రామన్న, హరిత, బాషా, హరిబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.



క్రీడాకారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ దంపతులు

అలరించిన నృత్య ప్రదర్శన

ఆదోని అర్బన్ : శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆదోనికి చెందిన శ్రీగురు కృప కూచిపుడి నాట్యాలయ చిన్నారులు సురేఖ, విశాలాక్షి, రామతులసి, బోధన, శాన్విశ్రీ, మనోజ్ఞ, చందనశ్రీ, స్నేహిత, రితిక, కృతికశ్రీ, దక్షిత, కావ్యాంజన, కార్తీక, అన్విత, వర్షిని, దివ్యశ్రీ, వేదావతి పాల్గొన్నారు. నాట్యాలయ గురువు వీరాజ్ రాయ్ ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపుడి నాట్యంలో భక్తులను అలరించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అధికారులు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.



చిన్నారులకు ప్రశంసా పత్రాలు అందజేసిన దృశ్యం

రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అవగాహన

ఆలూరు: జగనన్న సమగ్ర భూహక్కు - భూరక్ష పథకంలో భాగంగా ఆలూరు మండలం మనేకుర్తి, మూసానపల్లి గ్రామ పంచాయతీలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు విజయ్‌కుమార్, ఉల్లెప్పలకు ఆలూరు సబ్‌రిజిస్ట్రార్ మురళీమోహన్ శర్మ రిజిస్ట్రేషన్ విధానంపై అవగాహన కల్పించారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మురళీమోహన్ శర్మ మాట్లాడుతూ సమగ్ర భూసర్వే కింద జిల్లాలో ఆలూరు మండలంలోని మూసానపల్లి, కాత్రికి, మనేకుర్తి, అంగస్కల్లు, ఏ.గోనేహాళ్ గ్రామాలను ఎంపిక చేసినట్లు వివరించారు. ఆ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు విజయ్‌కుమార్, ఉల్లెప్పలకు (పీఏఎల్‌ఆర్) భూముల క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను స్థానిక గ్రామ సచివాలయంలోనే ఎలా చేయాలన్న అంశంపై సూచనలు, సలహాలు చేశారు. కంప్యూటరీకరణ చేసే విధానాలను వివరించారు. రెవెన్యూ అధికారులు నిర్ధారించిన భూముల ధరలను బట్టి ప్రభుత్వ రుసుం వసూలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూనియర్ అసిస్టెంట్ లక్ష్మి, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న ఆలూరు సబ్‌రిజిస్ట్రార్ మురళీమెహన్ శర్మ

శ్రీశైలానికి బయలుదేరిన శివస్వాములు

ఆలూరు: మహాశివరాత్రి పురస్కరించుకుని శ్రీశైల భ్రమరాంబామల్లికార్జున స్వామివారిని దర్శించుకునేందుకు ఆలూరుకు చెందిన శివ మాలదారులు గురువారం బయలుదేరివెళ్లారు. అంతకుముందు స్థానిక కోట వీధిలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో బిల్వార్చన, గంగ, ఫల, పుష్ప పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం 150 మందికి పైగా శివమాలదారులు శ్రీశైలానికి బయలుదేరివెళ్లారు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు మేళతాళాలతో ఊరేగింపుగా వారిని సాగనంపారు.

ఆస్పరి: మండలంలోని డీ.కోటకొండ గ్రామం నుంచి ఇరుముడులుతో శివదీక్షాపరులు శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. గురువారం స్థానిక శివాలయంలో గురుస్వామి రూపామోహన్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించిన అనంతరం 25 మంది శివదీక్షాపరులు శివనామ స్మరణ చేస్తూ బయలుదేరారు.



ఆలూరు కోటవీధి ఆలయం నుంచి పయనమైన శివస్వాములు

ఘనంగా పెద్దరాజు స్వామి ఉరుసు

నందవరం: మండల పరిధిలోని పోనకలదిన్నె గ్రామంలో పెద్దరాజుల ఉరుసు ఘనంగా నిర్వహించారు. గురువారం పీఠాధిపతి అక్బర్‌బాషా ఖాద్రి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి పూజలు నిర్వహించారు. స్వామి దర్గాను విద్యుద్దీపాలు, పూలమాలలతో ప్రత్యేకాలంకరణ గావించారు. ముందుగా స్వామికి పీఠాధిపతి బుధవారం గంధంతో ప్రత్యేక పూజలు చేపట్టారు. గురువారం ఉరుసు మహోత్సవం నిర్వహించారు. మత సామరస్యానికి ప్రతీకగా పెద్దరాజు ఉరుసును పీఠాధిపతి, గ్రామ పెద్దలు, భక్తులు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ పావని, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, రామచంద్రారెడ్డి, గోపాల్ రెడ్డి, జయపాల్ రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.



స్వామికి ఫాతెహాలు సమర్పిస్తున్న పీఠాధిపతి

ఉపాధ్యాయుడి మృతి తీరనిలోటు

గోనెగండ్ల: ములగుందం మండల పరిషత్ ప్రాథమిక మెయిన్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గోనెగండ్లకు చెందిన మురళీమోహన్ అనారోగ్యంతో బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్టీయూ నాయకులు గురువారం గోనెగండ్లలోని మురళి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి భౌతికకాయానికి నివాళులర్పించారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవ ప్రసన్నరాజు, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, ఎల్లప్ప, జగదీష్, రామచంద్ర తదితరులు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గోనెగండ్ల: మండలం సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ టి.నసురుద్దీన్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు ఉంటుందని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్, ఇతర శాఖాధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

పెయింట్ దుకాణానికి నిప్పు

పత్తికొండ రూరల్: స్థానిక గ్రామ పంచాయతీ కాంప్లెక్స్‌లోని ఎంజీఎల్ ట్రేడర్స్ పెయింట్ దుకాణానికి బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన ఘటన గురువారం వెలుగుచూసింది. షటర్ కింద అట్టలు, ప్లాస్టిక్ సంచులు పెట్టి పెట్రోలు పోసి నిప్పు అంటించినట్లు షాపు యజమాని లాల్‌బాషా తెలిపారు. అయితే షటర్ వద్దనే నిప్పు ఆరిపోయింది. లోపల పెయింట్ స్టాక్‌కు నిప్పు అంటుకుని ఉంటే భారీ ప్రమాదం జరిగి ఉండేదని పేర్కొన్నాడు. ఘటనపై విచారణ చేస్తున్నట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు.

పన్నులు చెల్లించండి

హొళగుంద: గ్రామాభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం ఇచ్చే నిధులే గాకుండ స్థానిక వనరులు ఎంతో అవసరమని, పంచాయతీకి పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందించాలని హొళగుంద మేజర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ కోరారు. 2022-23 సంవత్సరంతో పాటు పాత మొండి బకాయిలు, ఇతర అన్ని రకాల పన్నులను సకాలంలో చెల్లించి పాలక మండలికి సహకరించాలన్నారు. గ్రామ ప్రజలు ఇంటి, కొళాయి పన్నులు, లైసెన్స్ రెన్యూవల్‌లు, బంకు ఎంక్రోచ్‌మెంట్ తదితర అన్ని రకాల పన్నులు సకాలంలో చెల్లించాలని కోరారు. పన్నులు కట్టకపోతే కోర్టు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన హజరత్ అల్లీసాహెబ్ ఉరుసు

గోనెగండ్ల: మండల పరిధిలోని హెచ్ కైరవాడి గ్రామంలో హజరత్ అల్లీసాహెబ్ స్వాముల ఉరుసు మహోత్సవం ఘనంగా జరిగింది. మంగళ, బుధవారాల్లో గంధం, ఉరుసు కార్యక్రమాలు, గురువారం కిస్తీ కార్యక్రమంతో మహోత్సవాలు ముగిశాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రెండు గడ్డివాములు దగ్ధం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పందికోన గ్రామంలో గురువారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. విద్యుత్ తీగల ఎర్త్ వల్ల నిప్పురవ్వలు ఏర్పడి గడ్డివాములు కాలిపోయినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన గ్రామానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్నిప్రమాదంలో రూ.50 వేలు విలువైన పశుగ్రాసం మంటల్లో కాలిపోయిందని బాధిత రైతులు బుల్లేని రంగస్వామి, ఎర్రమల పెద్దరంగన్న వాపోయారు.

19 సిద్ధలింగేశ్వర స్వామి ఉచ్ఛాయోత్సవం

హొళగుంద: మండల పరిధిలోని ముద్దటమాగి గ్రామంలో ఈ నెల 19న సిద్ధలింగేశ్వర స్వామి ఉచ్చాయోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ గ్రామస్తులు గురువారం విలేకరులకు తెలిపారు. ఉత్సవంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు ఉదయం విరాట్‌మూర్తికి జలాభిషేకం చేసి అనంతరం ఆకుపూజ, రుద్రాభిషేకం, మహామంగళారతి, నైవేద్య సమర్పణ తదితర కార్యక్రమాలను జరిపిస్తారు. సాయంత్రం అశేష భక్తజనుల మధ్య ఉచ్చాయాన్ని లాగుతారని గ్రామస్తులు చెప్పారు. ఉత్సవంలో భాగంగా గ్రామంలో 'కర్ణ అరుజనర కాళగ' అనే సామాజిక బయలు నాటక ప్రదర్శన ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.



ముద్దటమాగిలో వెలసిన సిద్ధలింగేశ్వర స్వామి

ఉన్నత చదువులతోనే ఉజ్వల భవిష్యత్

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థినిలు ఇంటర్మీడియట్ తరువాత చదువులకు స్వస్తి చెప్పకుండా ఉన్నత చదువులు చదివితే ఉజ్వల భవిష్యత్ వుంటుందని స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాష పేర్కొన్నారు.స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినిలతో డిగ్రీ కళాశాలలో గురువారం'ఓపెన్ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు, ఇందులో భాగంగా జూనియర్ కళాశాల విద్యార్థినిలకు డిగ్రీ కళాశాలలో కల మౌళిక సదుపాయాలు, జవహర్‌నాలెడ్జ్‌సెంటర్, ప్రయోగశాల,లాంగ్వేజ్ ల్యాబ్, వర్చువల్ తరగతులు, స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్, ప్లేస్‌మెంట్ సెల్, గ్రంథాలయం, వ్యాయామశాల,క్రీడామైదానం, ఉద్యాన వనం తదితర విభాగాలను చూపి వాటి గురించి ఆయా విభాగాల అధ్యాపకులు వివరించారు.ఆయా విభాగాలను సందర్శించిన ఇంటర్మీడియట్ విద్యార్థినిలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరం అడ్మీషన్లు తీసుకొనేందుకు సుముఖత వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, సురేందర్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఎం.సుశీలమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రయోగశాల గురించి వివరిస్తున్న అధ్యాపకులు

వైభవంగా సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ఠ



సుంకులమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

మద్దికెర: మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలో గురువారం సుంకులమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. నూతనంగా నిర్మించిన దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ, చండీహోమం తదితర కార్యక్రమాలు పురోహితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పూజా కార్యక్రమాల్లో సర్పంచ్ అంజనేయులు, హేమంబరధర రావు, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే మద్దికెర శివజ్యోతి ఆశ్రమంలోని శివాలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు మల్లికార్జున, మాజీ ఎంపీపీ నీలకంఠరాయుడు పాల్గొన్నారు.

పంట ఉత్పత్తుల ధరలు తెలియజేయండి



ఆర్‌బీకే సిబ్బందికి సూచనలు చేస్తున్న పత్తికొండ ఏడీఏ విజయ్‌మోహన్‌కుమార్

ఆలూరు: రైతులకు పంట ఉత్పత్తుల కనిష్ట, గరిష్ట ధర తెలియజేసేందుకు రైతు భరోసా కేంద్రం సిబ్బంది కృషి చేయాలని పత్తికొండ సబ్‌డివిజన్ వ్యవసాయ సంయుక్త సంచాలకులు విజయ్‌మోహన్‌కుమార్ ఆదేశించారు. అందుకోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సీఎంఎఫ్ యాప్‌లో ధరలను అప్‌డేట్ చేయాలని సూచించారు. ఏడీఏ గురువారం దేవనకొండ ఆర్‌బీకేలో వివిధ గ్రామాల సిబ్బందితో సమావేశమయ్యారు. ఏడీఏ మాట్లాడుతూ.. రైతులకు పంట దిగుబడుల కనిష్ట, గరిష్ట ధరలను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. రైతుల ఫోన్లలో యాప్‌ను ఎందుకు అప్‌డేట్ చేయించడం లేదని సిబ్బందిపై మండిపడ్డారు. అలాగే రైతులకు అవగాహన కల్పించి ఈ-కేవైసీ చేయించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో ఏఓ సురేష్ బాబు, ఎంపీఈఓ విజయరాం, వీఏఏలు మల్లికార్జున, అబ్దుల్, రంగాచారి, తదితరులు ఉన్నారు. అనంతరం వివిధ ఎరువుల షాపులను ఏడీఏ విజయ్ మోహన్ తనిఖీ చేశారు.

డాక్యుమెంట్ మిస్సింగ్

నాక్లయింట్ అయిన కొటికల్ మహమ్మద్ షరీఫ్ తండ్రి (లేట్) కొటికల్ ఫరీద్ సాబ్ ఇంటి నెం. 1-541-59 శేర్‌ఖాన్ కాలనికి ఆదోనికి చెందిన నా క్లయింట్ యొక్క ప్లాట్ డాక్యుమెంట్స్ ఆదోని పట్టణంలో మండిగిరి పంచాయితి నందు నాక్లయింట్ పేరిటవున్న డాక్యుమెంట్ నెం. 2923/1991 తేది : 10-12-1991 గా రిజిష్టర్ కాబడినది. 05-02-2023న యంకన్న బావి వీధిలో పడిపోయిన వి.పోలిస్ కంప్లైంట్ ఇవ్వడమైనది.పోలీస్ సర్టిఫై నెం. MLD012300290345 Date :7/2/2023